ప్రజాశక్తి
సోమవారం 15 మే 2023   8 పేజీలు


ప్రకాశం


బాపట్ల



భానుడు భగభగ

- జిల్లాలో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత
- ఒంగోలులో 41 డిగ్రీలు నమోదు



ఆదివారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా ఉన్న ఒంగోలులోని మంగమూరు రోడ్డు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఒక్క రోజులోనే వాతావరణం మారి పోయింది. అకాల వర్షాలతో నిన్నామొన్నటి వరకూ ఎండల ప్రభావం కనిపించలేదు. వాతావరణంలో వచ్చిన మార్పులతో ఒక్క రోజులోనే ఎండలు మండిపోయాయి. భానుడు ప్రతాపం చూపించాడు. మూడు రోజుల పాటు ఎండలు తీవ్రంగా ఉంటాయని వాతావరణశాఖ కూడా వెల్లడించింది. అందుకు తగ్గట్టుగానే ఆదివారం నాడు ఎండలు తీవ్రంగా ఉన్నాయి. 40 డిగ్రీలు దాటింది. ఒంగోలులో 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండల తీవ్రత, ప్రభావం మాత్రం 44 డిగ్రీలను తలపించినట్లు అంచనా వేశారు. ఉదయం 10 గంటలకే ఎండలు ప్రభావం చూపాయి. 32 డిగ్రీల నుంచి ప్రారంభమై 41 డిగ్రీలకు చేరుకుంది. దీంతో జనం రోడ్లపై తిరగలేకపోయారు. మధ్యాహ్నం ఒంగోలు పట్టణంలో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. జనసంచారం బాగా తగ్గింది. ఎండలకు బయటకు రాలేకపోయారు. వేడిగాలులు కూడా మొదలయ్యాయి. ఎండలవల్ల గాలులు కూడా సెగలు పుట్టించాయి. వేసవి అంటే ఏమిటో ఒక్కరోజులోనే ఆదివారం నాడు జనానికి కనిపించింది. ఎండలకు ఇళ్లు కూడా వేడెక్కిపోయాయి. పిల్లలు, వృద్ధులు తల్లడిల్లిపోయారు. ఏసీల వినియోగం కూడా బాగా పెరిగింది. కరెంటు వాడకంపైనా ప్రభావం చూపింది. అక్కడక్కడా ఓవర్‌లోడ్‌తో కరెంటు సరఫరాలోనూ అంతరాయాలు కనిపించాయి. పెళ్ళిళ్ల సీజన్ కావడంతో జనం కూడా ఎండలకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. వీధుల్లో తోపుడు బండ్లపై కాయలు అమ్ముకునే చిరువ్యాపారులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు.

సంక్షోభంలో గ్రానైట్ పరిశ్రమ

- బల్లికురవ స్టీల్ గ్రేకి తగ్గిన డిమాండ్
- ఇతర దేశాలకు నిలిచిన ఎగుమతులు
- ఉత్పత్తి తగ్గించుకుంటున్న క్వారీలు
- నష్టాలు తగ్గించుకునేందుకు కార్మికులను తగ్గించుకుంటున్న యజమానులు



ప్రజాశక్తి-బల్లికురవ రూరల్

గ్రానైట్ పరిశ్రమ గడ్డుకాలం ఎదుర్కొంటోంది. నష్టాలతో క్వారీలు మూత దిశగా నడుస్తున్నాయి. స్టీలు గ్రేకి ఎగుమతులు లేకపోవడంతో గ్రానైట్ ఫ్యాక్టరీలో కటింగ్ చేసిన పరుపు రాళ్లు అలాగే నిలిచిపోయాయి. ఆ ప్రభావం గ్రానైట్ క్వారీలపై తీవ్రంగా పడింది. దీనితో కొందరు యజమానులు నష్టాలను తగ్గించుకునేందుకు కార్మికులను తగ్గించుకుంటున్నారు. మరికొందరుఉత్పత్తిని తగ్గించి మిషనరీ మీద భారం పడకుండా మరమ్మత్తులకు గురికాకుండా పరిశ్రమలు నడుపుతున్నారు. గ్రానైట్ పరి శ్రమల్లో గత రెండు దశాబ్దాలుగా ఇలాంటి పరిస్థితులు ఎప్పుడూ చవిచూడలేదని యజమానులంటున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పరిశ్రమల్లో పనిచేసే 20 వేల నుండి 30 వేల మంది కార్మికులు రోడ్డును పడే అవకాశం ఉంది.


బల్లికురవ మండల కేంద్రంలో బల్లికురవ నుంచి సంతమాగులూరు వెళ్లే రోడ్డులో ఈర్ల గంగమ్మ కొండ స్టీల్ గ్రేకి పెట్టింది పేరు. ఈ కొండ నుండి గత నాలుగు దశాబ్దాలుగా ముడి రాయి వెలికితీత పనులు జరుగుతున్నాయి. ఇక్కడ లభించే రాయికి దేశంలోనే కాకుండా ఇతర దేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడ దాదాపుగా 20 క్వారీలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ అనుమతితో కొంతమంది పనులు సాగిస్తున్నారు. బల్లికురవ, వేమవరం, మల్లయ్య పాలెం, సంతమాగులూరు, అద్దంకి.. ఈ ప్రాంతంలో ఉన్న గ్రానైట్ ఫ్యాక్టరీలు పరుపు రాళ్లు కటింగ్ చేస్తూ ఉంటాయి. గతంలో ఎంతో డిమాండ్ ఉన్న ఈ పరిశ్రమలు గత రెండు, మూడు మాసాల నుండి నష్టాల బారినపడి గడ్డుకాల పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. కరోనా దెబ్బకి దేశవిదేశాల్లో ఆర్థిక మాంద్యం తలెత్తడంతో గ్రానైట్ రాళ్ల ఎగుమతులు నిలిచిపోయాయి. బల్లికురవ స్టీల్ గ్రే రాయి గతంలో చైనా, అమెరికా, ఆస్ట్రేలియా, లం డన్, టర్కీ.. మరికొన్ని దేశాలకు ఎగు మతులు జరిగేవి. ఇప్పుడు ఇతర దేశాలకు ఎగుమతులు నిలిచిపోయాయని యజమానులంటున్నారు. దీనికి తోడు చుట్టు పక్కల స్థానికంగా ఉండే ఫ్యాక్టరీల్లో కటింగ్ చేసిన స్లాబులు డిమాండ్ లేక నిలిచిపోయాయి. స్థానికంగా ఉండే ఫ్యాక్టరీల్లో కట్టింగ్ చేసిన పరుపు రాళ్లు బెంగళూరు, మహారాష్ట్ర, తమిళనాడు, రాజస్థాన్ రాష్ట్రాలకి ఎగుమతులు జరిగేవి. స్టీల్ గ్రే రాయి రకం వ్యాపారం ఇక్కడ మందగించడంతో అక్కడ కొనుగోలు చేసే వ్యాపారస్తులు అరక కొరకు కొనుగోలు చేస్తున్నారు. గతంలో స్టీల్ గ్రేకి రూ.70 నుండి రూ.85 వరకు డిమాండ్ ఉండేది. కానీ ఇప్పుడు 50 రూపాయలకు కూడా కొనుగోలు చేసే ▶ 2లో


మాట్లాడుతున్న నాదెండ్ల మనోహర్

వైసిపి విముక్త ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

- రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టిన జగన్
- జనసేన పిఎసి ఛైర్మన్ నాదెండ్ల

5లో ▶



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

భజన చేస్తున్న పార్టీలు

ప్రజల వైపా..మోడీ వైపా..?

- గ్రామం మొత్తం కలిసి తిరునాళ్ల చేసుకోవాలి..
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

5లో ▶

సంక్షోభంలో గ్రానైట్ పరిశ్రమ

'మొదటి పేజీ తరువాయి)

పరిస్థితి లేదు. అది కూడా నష్టాలు పూడ్చుకునేందుకు గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులు బతిమిలాడి అమ్మవలసి వస్తోంది.

గ్రానైట్ ఫ్యాక్టరీలో పెరిగిన ఉత్పత్తి

గ్రానైట్ ఫ్యాక్టరీల్లో గతంలో కంటే ఇప్పుడు గ్రానైట్ కటింగ్ ఉత్పత్తి ఎక్కువవుతోంది. గతంలో రెండు కటింగ్ మిషన్లు ఉంటే నెలకు 30 వేల కటింగ్ పరుపు రాళ్లు ఉత్పత్తి చేసేవాళ్లు. ఇప్పుడు అధునాతన మల్టీ కలర్ కటింగ్ మిషన్ ద్వారా నెలకు ఒక లక్ష పరుపు రాళ్లు కటింగ్ చేస్తున్నారు. ఉత్పత్తి ఎక్కువ కావటం, కొనేవాళ్లు లేకపోవడంతో ఎగుమతులు చాలా మందగించాయి. దీంతో గ్రానైట్ ఫ్యాక్టరీలపై తీవ్ర ప్రభావం పడింది. గతంలో స్టీల్ గ్రే రాయిని బాగా డిమాండ్‌తో కొనుగోలు చేసే ఇతర రాష్ట్రాల వ్యాపారస్తులు ఇప్పుడు తమకు వద్దంటున్నారు. ఒకవైపు గ్రానైట్ పరిశ్రమల నిర్వహణ పెరగటం, విద్యుత్ ఛార్జీలు, పెనాల్టీ చార్జీలు పెంచటంతో పరిశ్రమ యజమానులు తాము ఫ్యాక్టరీ నిర్వహించలేమని అంటున్నారు.

ఉత్పత్తి తగ్గించాలని నిర్ణయం

గ్రానైట్ క్వారీలు ఫ్యాక్టరీల్లో నష్టాలు ఉన్నందువలన గ్రానైట్ క్వారీలు ఫ్యాక్టరీ యజమానులు పూర్తిగా మూసి వేయకుండా ఉత్పత్తిని తగ్గించుకోవాలని నిర్ణయించుకున్నారు. గతంలో గ్రానైట్ క్వారీలు నెలకు రెండు వేల మీటర్లు వెలికితీస్తే ఇప్పుడు వెయ్యి మీటర్లే తీస్తున్నారు. గ్రానైట్ ఫ్యాక్టరీల్లో ఫ్లాబులు మరలా అమ్మకాలు జరిగితే మరల క్వారీలకు ముడి రాయికి డిమాండ్ వస్తుందని వారు అంటున్నారు. అందుకే ఉత్పత్తి తగ్గించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. మంచి రకం రాళ్లనే అమ్మకాలు చేయాలని, గతంలో మాదిరిగా కాకుండా లైన్లు ఉన్న రాళ్లను ఎంతోకొంతకు అమ్మకుండా చేయాలనే చర్యలు చేపట్టేలా అందరూ సమిష్టిగా నిర్ణయం తీసుకున్నామని, క్వారీలు మూసివేస్తే.. గ్రానైట్ పరిశ్రమలు ఇంక తెరిచే పరిస్థితి లేదని అంటున్నారు. పరిశ్రమలు నష్టపోకుండా ప్రభుత్వం చూడాలని కోరుతున్నారు.

ఇతర రాష్ట్రాలకు వ్యాపారులు

తెలంగాణ రాష్ట్రంలో కరీంనగర్ జిల్లాలో ఉన్న క్వారీల్లో లభించే ముడిరాయికి పెద్ద ఎత్తున ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తున్నారు. అక్కడ రాయల్టీ తక్కువ ఉండటంతో వ్యాపారస్తులు అందరూ అక్కడికి వెళుతున్నారని యజమానులు అంటున్నారు. సంతమాగులూరు మండలం గురిచేపల్లి బ్యాక్ పెరల్ రాయికి కొంత మార్కెట్లో డిమాండ్ ఉందని అంటున్నారు. స్టీల్ గ్రే ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీల్లో కొన్ని వేల అడుగులు స్లాబులు నిల్వ ఉన్నాయని, వాటిని కొనుగోలు చేసేందుకు వ్యాపారస్తులు ఎవరూ ముందుకు రాకపోవడంతో కొన్ని ఫ్యాక్టరీ పరిశ్రమలు విద్యుత్ ఛార్జీలు చెల్లించేందుకు ధరలు తగ్గించి అమ్మవలసి వస్తుందని చెబుతున్నారు.



ఉత్పత్తిని తగ్గించాం..
గుంటక తిరుపత రెడ్డి, ప్రధాన కార్యదర్శి, బల్లికురవ కలర్ గ్రానైట్ క్వారీల యజమానుల సంఘం

గత మూడు నాలుగు దశాబ్దాల నుండి గ్రానైట్ క్వారీలు ఇప్పుడు ఎదుర్కొంటున్న సంక్షోభం ఇంతక ముందు చూడలేదు. గ్రానైట్ క్వారీలు తీవ్ర సంక్షోభంలో ఉన్నాయి. బల్లికురవ క్వారీలో లభించే స్టీల్ గ్రే రాయికి డిమాండ్ తగ్గింది. గ్రానైట్ ఫ్యాక్టరీల పరిశ్రమలో కటింగ్ చేసిన స్లాబులు నిల్వ ఉన్నాయి. అమ్మకాలు నిలిచిపోయాయి. దీంతో క్వారీ యజమానులు అందరం ఉత్పత్తి తగ్గించాలని సమిష్టి నిర్ణయం తీసుకున్నాం. ప్రభుత్వం వెంటనే పరిశ్రమలను ఆదుకోవాలి.

పీతల హేచరీని ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-నగరం: మండలంలోని దింది గ్రామంలో పీతల హేచరీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర పీతల మార్కెటింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్ కొప్పనాతి నాగబాబు ఆదివారం రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావును కోరారు. ఈ తీర ప్రాంతంలో పీతల హేచరీని ఏర్పాటు చేయడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని నాగబాబు ఎంపీ మోపిదేవికి విన్నవించారు. స్పందించిన ఎంపీ మోపిదేవి ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతాను అని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవికి నాగబాబు కృతజ్ఞతలు తెలియజేశారు.

గ్రామీణ ప్రాంతంలో వైద్య సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-మద్దిపాడు



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గ్రామీణ ప్రాంతాలలో కార్పొరేట్ వైద్య సేవలు అభినందనీయమని స్థానిక మాజీ సర్పంచ్ యూ. నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మద్దిపాడు నటరాజ్ కళా కేంద్రంలో ఒంగోలు ఎపిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పుగుండూరి నాగేశ్వరావు మాట్లాడుతూ మద్దిపాడు గ్రామంలో 15 రోజులకు ఒకసారి కార్పొరేట్ వైద్య సేవలు పేదలకు అందించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. డాక్టర్ కల్లూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎపిక్ హాస్పిటల్‌లో షుగర్, బిపి థైరాయిడ్‌తో పాటు పలు రకాల వ్యాధులకు, పాముకాటులాంటి వాటికి అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ వడ్లమూడి అనూష మాట్లాడుతూ మహిళలకు అన్ని ఆరోగ్య సమస్యలపై వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఐసీయూ తోపాటు అధునాతనమైన పరికరాలతో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 150 మందికి వైద్య పరీక్ష నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లూరి అంజిబాబు, రావి సుబ్బారావు, కొర్రపాటి మాధవరావు, పర్వతరెడ్డి శ్రీనివాసరావు, మండవ వెంకటేష్, కోడూరి హరీష్ బాబు, మండవ సుబ్బయ్య, ఆర్ల సాంబయ్య, ఎపిక్ హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికి తీసేందుకు సమ్మర్ కోచింగ్

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు గ్రంథాలయాల్లో సమ్మర్ కోచింగ్ నిర్వహిస్తున్నట్లు ఉప్పుగుండూరు గ్రంథపాలకురాలు పి నాగరజని అన్నారు. సమ్మర్ కోచింగ్ లో భాగంగా 7వ రోజైన ఆదివారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

గ్రామీణ ఆటలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి-మద్దిపాడు

గ్రామీణ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని విశ్రాంత హెచ్‌ఎం బి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం మద్దిపాడు శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులలో భాగంగా ఆటల పోటీలు ఉల్లాసంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు పివిఎల్ వసుంధరదేవి, చిన్నారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-కొండపి

వేసవి విజ్ఞాన శిబిరం సందర్భంగా ఆదివారం నాడు 13 మంది విద్యార్థులకు గ్రంథపాలకుడు కోటేశ్వరరావు బహుమతులు అందచేశారు. ఈ బహమతులు పుస్తక పఠనం, కథలు చెప్పడం, పాటలు పాడడం కార్యక్రమాలలో విజేతలైన విద్యార్థులకు అందజేశారు. అలాగే వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు కూడా అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయంలో ఉండే విజ్ఞానానికి సంబందించిన పుస్తకాలు చదవడం వలన విజ్ఞానవంతులు అవుతారని అన్నారు. విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

'జగనన్న విద్యాకానుక'ను సరిచూసుకోండి

ప్రజాశక్తి-పంగులూరు



జగనన్న విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న అధికారులు

జగనన్న విద్యా కానుక సామగ్రిలో ఏవైనా తక్కువ ఎక్కువ ఉంటే, వెంటనే తమ దృష్టికి తీసుకువచ్చి సరిచేసుకోవాలని, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు ఇంజనీర్ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం రాత్రి విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పంగులూరు హైస్కూల్లో ఉన్న జగనన్న విద్యా కానుక మండల లెవెల్ స్టాక్ పాయింట్‌ను పరిశీలించిన విషయం పాఠకులకు తెలిసిందే. ఆయన పరిశీలనలో 9వ నెంబరు గల బూట్లు రాలేదన్న విషయం తెలియటంతో అధికారులను నిలదీసిన విషయం తెలిసిందే. ఈ విషయమై ఆదివారం రాత్రి సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు ఇంజనీర్ శ్రీనివాసరావు పరిశీలించేందుకు పంగులూరు హైస్కూల్‌కి వచ్చారు. 9వ నెంబర్ బూట్లు ఎందుకు రాలేదో పరిశీలించారు. సిబ్బంది మొత్తం సామగ్రిని పరిశీలించి, ఏవైనా ఎక్కువగా వస్తే వాటిని తిరిగి పంపాలని, తక్కువగా ఉంటే తెలియజేసి వాటిని తెప్పించుకోవాలని కోరారు. విద్యార్థులకు ఎలాంటి లోటుపాట్లు జరగకుండా జగనన్న విద్యా కానుకను అమలుపరచాలన్నారు. ఈ విషయమై అధికారులను వివరణ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు మున్నయ్య, సీఎంఓ రజిని, ఎంఈఓ నాగభూషణం, పంగులూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివాములు దగ్ధం

ప్రజాశక్తి-చీమకుర్తి



మంటలను ఆర్పుతున్న ఫైర్ఇంజన్లు

మండలంలోని చీమకుర్తి నగర పంచాయతీ పరిధిలోని పాటిమీదపాలెంలో మూలె రమణారెడ్డికి చెందిన రెండు గడ్డివాములు దగ్ధం అయ్యాయి. అందిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం 7గంటల సమయంలో ఎంపిపి ప్రాథమిక పాఠశాల సమీపంలో మూలె రమణారెడ్డికి చెందిన రెండు గడ్డివాములు పక్కన ఉన్న విద్యుత్ లైనులోని రెండు తీగలు గాలికి రాసుకోవడంతో మంటల వచ్చి గడ్డివాములపై పడ్డాయి. దీంతో మంటల వలన వాములు రెండూ తగలపడ్డాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పారు. ప్రమాదంలో దాదాపు రూ.3 లక్షలు నష్టం జరిగి ఉండవచ్చని స్థానికులు తెలిపారు.

ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-పిసిపల్లి

పెదచెర్లోపల్లిలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత విద్యకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఇఓ దాసుప్రసాద్ ఆదివారం తెలిపారు. 1వ తరగతిలో చేరేందుకు ఐదు సంవత్సరాలు నిండిన ప్రతి విద్యార్థి ఆది, సోమవారాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుందని, కాబట్టి అర్హత కలిగిన విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగించుకోవాలని కోరారు. అందుకు విద్యార్థి ఆధార్ కార్డు, తండ్రి ఆధార్ కార్డ్, ఫోన్ నెంబర్, బియ్యం కార్డుతో ఆన్‌లైన్‌లో అప్లికేషన్ పెట్టుకోవాలన్నారు. వివరాలకు ఎంఇఓ దాసుప్రసాద్ సెల్ నెం. 8555947357, 9441442651లలో సంప్రదించాలన్నారు.

నేడు టిడిపి పాదయాత్ర

ప్రజాశక్తి-దరిశి

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 100 రోజు జరిగిన సందర్భంగా శామంతపూడి నుంచి దరిశి చివరి వరకు పాదయాత్ర చేయనున్నట్లు దరిశి మండల పార్టీ అధ్యక్షులు చిట్టె వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు యాదగిరి వాసులు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు మండలంలోని శామంతపూడి గ్రామం నుంచి దరిశి టిడిపి కార్యాలయం వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు వారు తెలిపారు. ముఖ్య అతిథులుగా ఒంగోలు పార్లమెంటు అధ్యక్షులు నూకసాని బాలాజీ, మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు పాల్గొంటారన్నారు.

ప్రజాశక్తి
3
సోమవారం 15 మే 2023

హనుమాన్ జయంతి ఉత్సవాలలో 'శిద్దా'

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక హరిహర క్షేత్రంలో ఆదివారం జరిగిన హనుమాన్ జయంతి ఉత్సవాలలో రాష్ట్ర మాజీమంత్రి శిద్దా రాఘవరావు లక్ష్మీ పద్మావతి దంపతులు పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. శిద్దా రాఘవరావు దంపతులను ఆలయ వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సంధర్భంగా ప్రసన్నాంజనేయస్వామి కిఆర్యవైశ్య మహిళలతో కలిసి 108 కలశాలతో అభిషేకాలు నిర్వహించారు. హెూమాలు చేపట్టారు. ఆంజనేయస్వామికి శిద్దా దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. నగరోత్సవం నిర్వహించారు. భారీ అన్నదానం చేశారు. కార్యక్రమాలలో శిద్దా ట్రస్టు సభ్యులు శిద్దా వెంకటేశ్వరరావు, శిద్దా పాండురంగారావు దంపతులు, శిద్దా సుధాకర్ దంపతులు, శిద్దా పెదబాబు, శిద్దాఆంజనేయప్రసాద్, శిద్దా శ్రీనివాసరావు, గోల్డెన్ గ్రానైట్ జనరల్ మేనేజర్ ఏ గిరిబాబు, ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

చర్చి ప్రతిష్టాపన

ప్రజాశక్తి-కురిచేడు

మండలంలోని ఆవులమంద గ్రామంలో రూ.80 లక్షలతో నిర్మించిన తెలుగు బాప్టిస్ట్ చర్చి ప్రతిష్ట కార్యక్రమం శుక్రవారం నుంచి ప్రారంభమైంది. అందులో భాగంగా మూడో రోజు ఆదివారం మధ్యాహ్నం జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎంఎల్ఏ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు బూచేపల్లి కుటుంబ సభ్యులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్ధనలో వారు పాల్గొన్నారు. సంఘకాపరి అజయ్ కుమార్ బూచేపల్లి కుటుంబానికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వీరిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, గొట్టిపాటి బాలకోటయ్య, నారు శ్రీనివాసులురెడ్డి, ప్రిన్సిపాల్ నాగిరెడ్డి, పడమర వీరాయపాలెం మాజీ సొసైటీ అధ్యక్షులు ఊట్ల వెంకటేశ్వర్లు, మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక

ప్రజాశక్తి-మార్కాపురం

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు మార్కాపురంలోని నేతాజీ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు ఎంపికయ్యారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ శనివారం రాత్రి విడుదల చేసిన కంబైండ్ గ్రాడ్యుయేట్ లెవెల్ ఉద్యోగ ఫలితాలలో మార్కాపురం పట్టణంలోని నేతాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌లో శిక్షణ పొందిన బీసాబత్తుని ప్రవీణ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)లో అకౌంటెంట్ ఉద్యోగానికి, బట్టపోతుల స్వాతి పోస్టల్ అసిస్టెంట్ ఉద్యోగానికి జనరల్ కేటగిరీలో ఎంపికైనట్లు నేతాజీ ఇనిస్టిట్యూట్ గౌరవ సలహాదారులు కొత్తేర్వ కాశిరెడ్డి ఆదివారం తెలిపారు. వీరిలో ప్రవీణ గత సంవత్సరం ఐబీపీస్ ద్వారా యూనియన్ బ్యాంకులో ఉద్యోగం సాధించి కొనకనమిట్ల బ్రాంచ్‌లో క్లర్క్‌గా ఉద్యోగం చేస్తుండటం గమనార్హం. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులు ప్రవీణ, స్వాతిలు మాట్లాడుతూ కేవలం నేతాజీ ఇనిస్టిట్యూట్ అధ్యాపక బృంద వ్యక్తిగత శ్రద్ధ, అర్ధమెటిక్, రీజనింగ్‌లో తారక్, కాశిరెడ్డి బోధించిన షార్ట్ కట్ మెథడ్స్‌తో ఉద్యోగాల సాధన సులభతరమైందని అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ అభినందన కార్యక్రమంలో నేతాజీ ఇనిస్టిట్యూట్ అధ్యాపక బృందం తారక్, శేషు, రమణారెడ్డి, గౌతమ్, ఫణి కుమార్, ఫణీంద్రారెడ్డి, నాగరాజు, నబి ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులకు అభినందనలు తెలిపారు.

మొక్కజొన్న చేను దగ్ధం

ప్రజాశక్తి-పంగులూరు

ప్రమాదవశాత్తు మొక్కజొన్న చేను దగ్ధం అయిన సంఘటన మండల పరిధిలోని అలవలపాడు గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. అందిన సమాచారం ప్రకారం.. అలవలపాడు గ్రామానికి చెందిన గరికపాటి ప్రభు తన మూడెకరాల మొక్కజొన్న చేలో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. ఈ ప్రమాదంలో మూడు లక్షల నష్టం వాటిలినట్టు రైతు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పట్టణంలోని ఎల్ఎంకె హైస్కూల్‌లో 1988-93 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం పాఠశాల ఆవరణలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా వేదిక మీదకు పూర్వ విద్యార్థులు ఆహ్వానించారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. అమరులైన అధ్యాపకులు, సాటి విద్యార్థులకు నివాళు లర్పించారు. ఉపాధ్యాయులు కె వెంకటేశ్వరరెడ్డి, ఎస్ అచ్చిరెడ్డి, ఎం బ్రహ్మయ్య, విసి రామశాస్త్రి, నారయ్య, ఏ బ్రహ్మయ్య, ఉపాధ్యాయిని అరుణ, పాఠశాల సిబ్బంది మాలకొండయ్యలను సత్కరించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని సంతోషంగా గడిపారు. 1993 ఎల్ఎంకె బ్యాచ్ విద్యార్థులు 30 సంవత్సరాలకు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించటం విద్యాబుద్ధులు నేర్పిన గురువులైన తమను గుర్తుపెట్టుకొని



గురువులతో ఎల్ఎంకె 93 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

సగౌరవంగా ఆహ్వానించి సత్కరించటం సంతోషదాయకమని ఉపాధ్యాయులు తెలియజేశారు. ఉన్నత స్థానాలను చేరుకుని సమాజసేవలో భాగస్వాములు అయి ఎల్ఎంకె హైస్కూల్ పేరును గొప్పగా విశ్వవ్యాప్తం చేయాలని అన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులకు స్థానికంగా ఉంటున్న తోటి స్నేహితులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్లు, జేసీబీ స్వాధీనం

ప్రజాశక్తి-జరుగుమల్లి

మండలంలోని చతుకుపాడు గ్రామం వద్దనున్న పాలేరు నది నుంచి ఆక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు టిప్పర్లను సెబ్ పోలీసు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తున్న మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకొని అపరాధ రుసుం విధించినట్లు సెబ్ ఎస్ఐ దయాకర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేర సెబ్ ఎస్ఐ దయాకరు, జెడీ బృందం సభ్యులతో కలిసి స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం పాలేరు నదిలో వున్న జెసీబిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఒక్కో టిప్పరుకు రూ.25 చొప్పున రూ.75 వేలు అపరాధ రుసుం విధించారు. అక్రమంగా ఇసుక తరలింపునకు కారణమైన జెసీబికి రూ.50 వేలు అపరాధ రుసుం విధించామన్నారు. దర్యాప్తు నిమిత్తం తదుపరి చర్యల కోసం ఈ వాహనాలను జరుగుమల్లి పోలీసు స్టేషనుకు స్వాధీనపరచారు. అపరాధ రుసుం చెల్లించిన తరువాత వాహనాలను అప్పగిస్తామని సెబ్ ఎస్ఐ దయాకర్ తెలిపారు.

బిజెపికి వాత పెట్టిన కర్ణాటక ఓటర్లు

ప్రజాశక్తి-మార్కాపురం

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపికి కర్రు కాల్చి వాత పెట్టారని, దేశ వ్యాప్తంగా ఓటర్లు కర్ణాటక తరహాలో ఆలోచించాలని కాంగ్రెస్ పార్టీ మార్కాపురం నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు సయ్యద్ జావిద్ అన్వర్ విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో మతోన్మాద శక్తులను ప్రోత్సహిస్తూ కులాలు, మతాల పేరిట రాజకీయం చేస్తున్న బిజెపికి కర్ణాటక ఎన్నికలలో అక్కడి ప్రజలు ఇచ్చిన తీర్పు పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో కర్ణాటకలో కాంగ్రెస్ విజయం సాధించడం పట్ల సంబరాలు జరుపుకున్నారు. కేక్ కట్ చేశారు. మిఠాయిలు పంచుకున్నారు. అనంతరం అన్వర్ మాట్లాడుతూ బిజెపికి కర్ణాటక రాష్ట్ర ప్రజలు సరైన బుద్ధి చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తిరుమలశెట్టి రామయ్య, శీలం రామకష్టారెడ్డి, దూదేకుల మస్తాన్, న్యాయవాదులు నూతలపాటి దేవరాజ్, షేక్ మతిన్ బాషా, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ మొహమ్మద్ ఇస్మాయిల్, ఫిదా రసూల్, సున్నిపెంట ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

కొండపి: భారతదేశంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందని జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు మరియు పిసిసి



మార్కాపురంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు


మెంబర్, కొండపి సమన్వయ కమిటీ సభ్యులు దేవరపల్లి సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం కర్ణాటక రాష్ట్ర ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించిన సందర్భంగా కొండపిలో ప్రజలకు మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్బంగా దేవరపల్లి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ విజయం ప్రజలకు అంకితమని అన్నారు. సమన్వయ కమిటీ సభ్యులు బొడ్డు సతీష్ మాట్లాడుతూ భారత దేశంలోని అన్ని రాష్ట్రాలలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పొన్నలూరు మండ నాయకులు తానికొండ శ్రీనివాసరావు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు తూగుట్ల వెంకటరమణారెడ్డి, కిసాన్ కాంగ్రెస్ మర్రిపూడి మండల అధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి సిఎం పెద్దపీట..

మార్కాపురం శాసనసభ్యులు నాగార్జునరెడ్డి

ప్రజాశక్తి-పొదిలి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మార్కాపురం శాసనసభ్యులు కుందురు నాగార్జున రెడ్డి అన్నారు. పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మరోసారి గెలిపించేందుకు ప్రజలు దీవించాలన్నారు. ఆదివారం పొదిలి నగర పంచాయతీ పరిధిలోని టైలర్స్ కాలనీ, బాపిస్టు పాలెంలలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ మంచివిద్య, వైద్యం అందించేందుకు అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన వంటి పథకాలను అమలు చేస్తోందని అన్నారు. ప్రతి పేదవాడికి సొంతింటి కల సాకారం చేసేందుకు జగనన్న కాలనీలు ఏర్పాటు చేసిన ఘనత వైసిపికి దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా టైలర్స్ కాలనీ, బాపిస్టుపాలెం నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు, మాజీ మండల కన్వీనర్ గుజ్జుల సంజీవరెడ్డి, జి శ్రీను, మాజీ జడ్‌పిటిసి సాయి రాజేశ్వరరావు,



ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు ఎస్‌కె మస్తాన్‌వలి, నగర పంచాయతీ కమిషనర్ డానియల్ జోసఫ్, వైసిపి మండల కన్వీనర్ దుగ్గెంపూడి శ్రీనివాస రెడ్డి, నగర పంచాయతీ అధ్యక్షురాలు ఎస్‌కె నూర్జాహాన్ బేగం, సిసికెఆర్ శ్రీనివాసరెడ్డి, మండల, నగర పంచాయతీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-చీరాల

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఆదివారం ఉదయం చినగంజాం సమీపంలో జరిగింది. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యక్తి మృతదేహం రైలు పట్టాల పక్కన పడి ఉండటాన్ని విధుల్లో ఉన్న కీ మ్యాన్ జీఆర్పీ పోలీసులకు సమాచారాన్ని అందజేశారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శవపరీక్ష కోసం చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉంటుందన్నారు. శరీరంపై జీన్స్ ప్యాంటు, లేత నీలం రంగు చొక్కా ధరించి ఉన్నాడని తెలిపారు. ఇతని వద్ద మరే ఇతర ఆధారాలు లభ్యం కాలేదన్నారు. రైలులో ప్రయాణిస్తూ జారిపడి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఘటనపై జీఆర్పీ ఎస్ఐ కొండయ్య కేసు నమోదు చేశారు.



మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్న ఎస్ఐ

మద్యం బాటిళ్లు పట్టివేత

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలో ఆదివారం అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి నుంచి మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఫిరోజా ఫాతిమా తెలిపారు. ఆళ్ల రవీంద్రారెడ్డి అనే వ్యక్తి అక్రమంగా మద్యం తీసుకొని వెళుతుండగా వచ్చిన సమాచారం మేరకు దాడి చేయగా 12 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ 2,660 రూపాయలు ఉంటుందని తెలిపారు. మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకొని రవీంద్రారెడ్డిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.



చెక్కు అందజేస్తున్న నాదెండ్ల మనోహర్

మోహన్‌రావు కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-దరిశి

తాళ్ళూరు మండలం తోటవెంగన్నపాలెం గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త చెల్లు మోహన్‌రావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన భార్య ధనలక్ష్మికి రూ.5 లక్షల చెక్‌ను జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెళ్ల మనోహర్ చేతులు మీదుగా అందజేశారు. ఆదివారం దరిశి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొటుకు రమేష్, జిల్లా అధ్యక్షులు గయాజ్‌తో కలిసి ఆయన ధనలక్ష్మికి చెక్‌ను అందించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు ఇంటిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన లీగల్‌సెల్ జిల్లా కార్యదర్శి వరికూటి నాగరాజు, ప్రసాద్, రాము, పవన్ పాల్గొన్నారు.

ఎంపిపి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-నగరం

హనుమాన్ జయంతి సందర్భంగా నగరంలో వేంచేసి ఉన్న హనుమంతుని మందిరం దగ్గర మండల ఎంపీపీ చింతల శ్రీకష్ణయ్య ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో తాడివాకవారిపాలెం సర్పంచ్ తాడివాక అనిల్ కుమార్, బోయినపల్లి రాఘవరావు పాల్గొన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లు ముమ్మరం: కలెక్టర్

ప్రజాశక్తి-నిజాంపట్నం, బాపట్ల జిల్లా

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పనులు ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటన ఖరారైన నేపథ్యంలో ఆదివారం నిజాంపట్నంలో సభాప్రాంగణం పనులు, హెలీ ప్యాడ్ పనులను జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా, పార్లమెంటు సభ్యులు మోపిదేవి వెంకటరమణ పరిశీలించారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం నాటికి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పనులు పూర్తి చేయాలన్నారు. ముఖ్యమంత్రి సభా ప్రాంగణం వద్ద, రహదారుల వద్ద అవసరమైన ప్రాంతాల్లో బ్యారికేడ్లు



నిజాంపట్నంలో సభాప్రాంగణం పనులు, హెలీ ప్యాడ్ పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా

ఏర్పాటు చేయాలన్నారు. రహదారి మరమ్మతులు చేపట్టాలని ఆర్అండ్‌బి అధికారులకు కలెక్టర్ చెప్పారు. ముఖ్యమంత్రి సభకు వచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా తాగునీరు సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. సభా ప్రాంగణం వద్ద మత్స్య శాఖకు సంబంధించి మూడు స్టాల్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ చెప్పారు. ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మి శివ జ్యోతి, జిల్లా అదనపు ఎస్‌పి పి మహేష్, మత్స్య శాఖ జెడి సురేష్, వ్యవసాయ శాఖ జెడి అబ్దుల్ సత్తార్, జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారి పార్థసారథి, చీరాల రెవెన్యూ డివిజనల్ అధికారి సరోజిని, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి రవీంద్ర, తహశీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి

మత్స్యకారులకు సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-నగరం

సముద్రాన్ని నమ్ముకుని జీవిస్తున్న మత్స్యకారుల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ అన్నారు. చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక చేయూతను అందించేందుకు ఈ నెల 16వ తేదీన నిజాంపట్నం వస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలనే ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని తెలిపారు. మత్స్యకారులకు గతంలో నాలుగు వేల రూపాయలు అందించేవారని నేడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి 10 వేల రూపాయలు అందజేస్తున్నారని తెలిపారు. 16న జరిగే ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంఘీభావ పాదయాత్ర చేయండి

ప్రజాశక్తి-వేమూరు

లోకేష్ యువగళం పాదయాత్ర ప్రారంభించి 100 రోజులు పూర్తయిన సందర్భంగా సంఘీభావ పాదయాత్రలు నిర్వహించాలని మాజీ మంత్రి తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సభ్యులు నక్క ఆనంద్‌బాబు వేమూరు నియోజకవర్గ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నేటి ఉదయం 7 గంటలకు చుండూరు మండలం యడ్లపల్లి నుంచి సంఘీభావ పాదయాత్ర ప్రారంభమవుతుందని ఆదివారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పాదయాత్రకు వేమూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల తెలుగుదేశం పార్టీ శ్రేణులు కదలి రావాలని కోరారు. రానున్నది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వమేనని, యువకులంతా ఉత్తేజంతో ముందుకు నడిచి యువనేత లోకేష్ పాదయాత్రకు సంఘీభావం తెలియచేయాలని ఆయన అన్నారు.



ఇండియన్ ప్రైడ్ సెలబ్రిటీ అవార్డును అందుకుంటున్న డాక్టర్ రాధాకృష్ణ

డాక్టర్ రాధాకృష్ణకు సెలబ్రిటీ అవార్డు

ప్రజాశక్తి-చీరాల

సిటిజన్స్ వెల్ఫేర్ ఫోరం, ప్రైడ్ ఇండియా కల్చరల్స్ వారి ఆధ్వర్యంలో చీరాలకు చెందిన డాక్టర్ సురసుర రాధాకృష్ణ ఇండియన్ ప్రైడ్ సెలబ్రిటీ అవార్డును అందుకున్నారు. శనివారం రాత్రి శ్రీకాళహస్తిలోని త్రినేత్ర నృత్య నీరాజనం వేదికపై మాజీ ఎమ్మెల్యే ఎస్ సీవీ నాయుడు, శ్రీకాళహస్తి దేవస్థాన చైర్మన్ అంజురు తారక శ్రీనివాసులు, ఆర్డీవో రామారావు, డీఎస్పీ డి విశ్వనాథ్ తదితర ప్రముఖుల సమక్షంలో ఈ అవార్డును వారి చేతుల మీదుగా అందుకున్నారు. చీరాల మండలం ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గ్రామాల్లో వైద్యసేవలను అందించినందుకు, పేద ప్రజల ఆరోగ్యం పట్ల చూపిన శ్రద్ధకు ఈ అవార్డు వచ్చినట్లు అవార్డు గ్రహీత రాధాకృష్ణ తెలిపారు.

మేదరమెట్లలో రోడ్డు విస్తరణ పనులు

ప్రజాశక్తి-మెదరమెట్ల

మేదరమెట్ల గ్రామంలో శనివారం నుంచి ఆక్రమణలకు గురయిన కట్టడాలను తొలగిస్తున్న కార్యక్రమాన్ని అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎవరికి ఇబ్బంది లేకుండా ఆక్రమణలను తొలగించాలని అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జె లక్ష్మీకాంత్, ఎమ్మార్వో లక్ష్మణ్ నారాయణ, గ్రామ సర్పంచ్ బొనిగల ఎలిసమ్మ, ఎస్ఐ నాగ శివారెడ్డి, పోలీస్ బృందం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులతో జీవన ప్రమాణం పెంచుకోండి

పూడికతీత పనులను పరిశీలించిన రాష్ట్ర డైరెక్టర్ చినతాతయ్య

ప్రజాశక్తి-వేటపాలెం

నిరుపేదలు ఉపాధి హామీ పనులతో జీవన ప్రమాణాన్ని పెంపొందించుకోవాలని స్టేట్ డైరెక్టర్ పి చినతాతయ్య తెలిపారు. మండలంలోని అక్కాయపాలెం పంచాయతీ అబ్దుల్‌కలాం కాలనీ ఎదురు పొలాల్లో జరుగుతున్న పూడికతీత పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడి సమస్యలు ఏవైనా ఉంటే చెప్పాలని అడిగారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేతనాలను అడిగి తెలుసుకొన్నారు. రోజువారి పనులకు ఆటంకం కలుగకుండా ఎన్ఆర్‌జిఎస్ వేతనంతో మరో పనికి వెసులుబాటు కలిగే విధంగా పనుల సమయాలను మార్చుకొనే వీలును పరిశీలించాలని పిడి శంకర్ నాయక్‌ను ఆదేశించారు. ఎండాకాలం ప్రతి కూలీకి రెండు లీటర్ల తాగునీరు అందించాలన్నారు. ఆయా గ్రామాల్లో పెద్దలతో మాట్లాడి చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్ఆర్‌జిఎస్ నిధులతో నిర్వహిస్తున్న చల్లారెడ్డిపాలెం పంచాయతీలోని మొక్కల పెంపకాన్ని, రామన్నపేటలోని డ్రాగన్ ఫ్రూట్ తోటను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వేటపాలెం ఎంపిడిఓ ఎంవిఎస్ శర్మ, ఏపిఓ వి సుధారాణి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రతిభకు పురస్కారం

ప్రజాశక్తి-మేదరమెట్ల



బహుమతులందిస్తున్న దృశ్యం

మండలంలోని పమిడిపాడు గ్రామంలో పదో తరగతి పరీక్ష ఫలితాలలో రావి జగదీశ్వరి 595, రావి తేజశ్రీ 587, రవి మోక్షజ్ఞ 565, రావి సౌమ్య 531, మార్కులను సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన వీరికి రావి కుటుంబ సేవా సమితి ఆధ్వర్యంలో సన్మానాలు ఆదివారం జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆర్‌విఆర్ గ్రూప్ చైర్మన్ ఆర్‌విఆర్ చౌదరి పాల్గొని 595 మార్కులు సాధించిన జగదీశ్వరి చదువు బాధ్యతలను రాష్ట్ర కమిటీ వారు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. మిగిలిన తేజశ్రీ, మోక్షజ్ఞ, సౌమ్యలకు 20 వేల రూపాయల చొప్పున నగదును బహుమతిగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రావి కుటుంబ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపాలకృష్ణ, జనరల్ సెక్రెటరీ సత్యనారాయణ, కమిటీ సభ్యులు హనుమంతరావు, నాని, ఉమ్మడి ప్రకాశం జిల్లా సెక్రెటరీ బాబు, వైస్ ప్రెసిడెంట్ అంకమ్మ చౌదరి, ట్రెజరర్ శ్రీనివాసులు, రావి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సింగరకొండలో కృష్ణ చైతన్య పూజలు

ప్రజాశక్తి-అద్దంకి: సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానంలో హనుమజ్జయంతి కార్యక్రమాలు వైభవోపేతంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈరోజు వైసిపి అద్దంకి ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య మరియు చీరాల శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పూజలు నిర్వహిస్తున్న కృష్ణ చైతన్య



వైద్యులతో సేవా సంకల్ప్ ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు

230 మందికి ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

సంతనూతలపాడు సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్ట్ వారు స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 230 మందికి వైద్య సేవలను అందించారు. ఈ వైద్య శిబిరంలో ఉష కార్డియాక్ సెంటర్ విజయవాడ వారి వైద్య బృందం, ఒంగోలుకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ ఉమాపతి చౌదరి, డాక్టర్ టి కిరణ్మయి చౌదరి, డాక్టర్ ఎన్ రమణారెడ్డి, డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి, డాక్టర్ మణి కిషోర్, వైద్య సేవలను అందించారు. ఈ శిబిరాన్ని రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పి ప్రకాష్ ప్రారంభించారు. సంతనూతలపాడు హైస్కూల్ 1989-90 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి ఈ కార్యక్రమం నిర్వహించారు. సేవా సంకల్ప్ ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ రమణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

షుగర్, బీపీ పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-పంగులూరు

షుగరు, బీపీ, ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రోగులకు వైద్యులు పిలుపు నిచ్చారు. ఇంకొల్లు మండలం గంగవరం గ్రామంలోగల, మంచాల వెంకటరామయ్య, రంగమ్మ విజ్ఞాన కళ్యాణ మండపంలో, గంగవరం ప్రాంత ఆరోగ్య సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో, ఆదివారం జరిగిన షుగర్, బీపీ రెగ్యులర్ ఉచిత వైద్య శిబిరంలో పలువురు వైద్యులు ప్రసంగించారు. పేద ప్రజలు లక్షలాది రూపాయలు చిన్న చిన్న వ్యాధులకు కూడా ఖర్చు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి వైద్య శిబిరాల్లో వైద్యుల సలహాలు తీసుకొని ఖర్చులేని వైద్యాన్ని ప్రజలు అలవాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు అన్నవరపు సాంబయ్య మాట్లాడుతూ, పేద ప్రజలకు వైద్యం అందుబాటులో లేకుండా పోతోందని, షుగరు, బీపీ వంటి చిన్న చిన్న వాటికి కూడా పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోందని అన్నారు. దాతలు, అభ్యుదయ వాదుల సహకారంతో, ఇలాంటి



గంగవరంలో జరిగిన వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

వ్యాధులకు ఖర్చు లేని వైద్యాన్ని తీసుకోవచ్చని, మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని అన్నారు. డాక్టర్ వి టైటస్ మాట్లాడుతూ సరైన మందులు వాడుకుంటూ ఎప్పటికప్పుడు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని అన్నారు. డాక్టర్ మంచాల రమేష్ కుమార్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని పేద ప్రజలకు వారి ఆరోగ్యాలకు భరోసా ఇచ్చేందుకే గంగవరం ప్రాంత ఆరోగ్య సంక్షేమ వేదిక ఏర్పడిందని, దీనిని పేద ప్రజలంతా ఉపయోగించుకోవాలని అన్నారు. అనంతరం షుగరు, బీపీ వ్యాధిగ్రస్తులకు రక్త పరీక్షలు చేసి రెండు నెలలకు సరిపడా మందులను 200 రూపాయలకే అందించారు. ఈ నెల వైద్య శిబిరాన్ని మంచాల వెంకటరామయ్య, రంగమ్మ, మంచాల అనంత విజయలక్ష్మిల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బోడెంపూడి సురేంద్ర కమలాకర్ అధ్యక్షత వహించగా, ఆర్ఎంపి మాలకొండయ్య, బోడెంపూడి సూరిబాబు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం మాజీ కార్యదర్శి వై సిద్దయ్య, మంచాల సరోజిని తదితరులు ప్రసంగించారు. మందుల పంపిణీలో గంగవరం ప్రాంత ఆరోగ్య సంక్షేమ వేదిక కన్వీనర్ కే బాలచందర్, బాపట్ల జిల్లా రైతు సంఘం కార్యదర్శి తలపనేని రామారావు, కే సృజన సహకారం అందించగా, రక్త పరీక్షలను తలమాల ఏసుబాబు నిర్వహించారు.

భజన చేస్తున్న పార్టీలు

ప్రజల వైపా..మోడీ వైపా.?

- గ్రామం మొత్తం కలిసి తిరునాళ్ల చేసుకోవాలి.. - సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-చీమకుర్తి

మోడీకి భజన చేస్తున్న పార్టీలు ప్రజల వైపా, మోడీ వైపా తేల్చుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. మండలంలోని కెవిపాలెం శ్రీప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల సందర్భంగా కెవిపాలెం సిపిఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ప్రజానాట్య మండలి వారిచే సాంస్కృతిక వేదికను ఏర్పాటుచేశారు. ప్రజలను చైతన్యపరిచే కళారూపాలు ప్రదర్శించారు. సాంస్కతిక వేదికపై వి.శ్రీనివాసరావు మాట్లాడారు. చీమకుర్తి మండలం, కె.వి పాలెంలో దేవాలయం ఎదురుగా ప్రజా దేవాలయం ఉందని అదే సిపిఎం కార్యాలయం అని అన్నారు. ప్రజలకు సమస్యలు వస్తే సిపిఎం కార్యాలయానికి వస్తారని తెలిపారు. గ్రామం మొత్తం కలిసి తిరునాళ్ల చేసుకునే రోజు రావాలని, పార్టీల పేరుతో విడివిడిగా కాదన్నారు. దేశంలో మతతత్వాన్ని, విద్వేషాలను రెచ్చగొడుతున్న మోడీని సాగనంపితేనే దేశం బాగుపడుతుందన్నారు.



ప్రజానాట్యమండలి కళాకారుల ప్రదర్శన

ప్రజానాట్యమండలి కళాకారులు చేస్తున్న కళారూపాలు అభినందనీయమన్నారు. వేదికపై ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్, రాష్ట్ర సీనియర్ నాయకులు జగన్, జిల్లా కార్యదర్శి పొత్తూరి సురేష్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎస్కె.మాబు, మండల కార్యదర్శి పూసపాటి వెంకటరావు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బెజవాడ శ్రీనివాసరావు, పి.సురేష్, కొల్లూరి వెంకటేశ్వర్లు, నల్లూరి కృష్ణయ్య, పులి ఓబులరెడ్డి పాల్గొన్నారు.

– తిరునాళ్ల సందర్భంగా నల్లూరి పౌండేషన్ అధినేత, ప్రవాస భారతీయుడు నల్లూరి వెంకటశేషయ్య దంప తుల ఆధ్వర్యంలో దేవస్థానం పరిధిలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

110 అడుగుల టిడిపి విద్యుత్ ప్రభ

ప్రముఖ ప్రవాస భారతీయుడు నల్లూరి వెంకటశేషయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 110 అడుగుల టిడిపి విద్యుత్ ప్రభపై జబర్దస్త్ టీము కళాకారులు అలరించారు.

వైసిపి విద్యుత్ ప్రభపై కార్యక్రమాలు

వైసిపి విద్యుత్ మందిరంపై పాటకచ్చేరీలు ఏర్పాటు చేశారు. టివి, సినీ కళాకారుల కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, ఎమ్మెల్యే టిజెఆర్.సుధాకరబాబు, వైసిపి మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు మాట్లాడారు.

వైసిపి విముక్త ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

- రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టిన జగన్
- కార్యకర్తలకు అండగా ఉంటాం
- జనసేన పార్టీ పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

వైసిపి విముక్త ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జనసేన పార్టీ పనిచేస్తుందని, ఆ దిశగానే రానున్న ఎన్నికల్లో కలిసొచ్చే పార్టీలతో కలిసి ప్రయాణం చేస్తుందని ఆ పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. కొండపి నియోజక వర్గం, శింగరాయకొండ మండలానికి చెందిన ప్రసాద్ అనే కార్యకర్త చనిపోవడంతో ఆ కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల చెక్కును జనసేన పార్టీ తరుపున ఆదివారం అందజేశారు. స్థానిక మౌర్య హెూటల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రసాద్ కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మనోహర్ మాట్లాడారు. జనసేన కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పార్టీలో క్రియా శీలక సభ్యత్వం తీసుకున్న వారికి ఏదైనా జరగరానిది జరిగితే వారి కుటుంబాలకు పార్టీ మద్దతుగా ఉంటుందన్నారు. ప్రసాద్ పిల్లల చదువుల బాధ్యత కూడా జనసేన తీసుకుంటుందని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అంధకారంలోకి నెట్టబడిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జాడే లేకుండా పోయిందన్నారు. చేసిన పనులకు బిల్లులు రాక వైసిపి చెందిన నేతలే ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఉందన్నారు. ఆరోగ్యశ్రీకి రూ.వెయ్యి కోట్ల బకాయిలు ఉంటే ఇటీవలే రూ.100 కోట్లు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రకాశం జిల్లా వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసే విషయంలో వైసిపికి చిత్తుశుద్ధి లేదన్నారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని నాడు వైసిపి నేత వైవి సుబ్బారెడ్డి పాదయాత్ర చేశారని, ఇప్పుడు కూడా ఆయన మరోసారి ప్రాజెక్టు కోసం పాదయాత్ర చేస్తే బాగుంటుందని సూచించారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోతే అవి బాగుచేయించే పరిస్థితి కూడా లేదన్నారు. వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపేందుకు మెరుగైన ప్రత్యామ్నాయం కోసం జనసేన కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, నగర అధ్యక్షులు మలగా రమేష్ పాల్గొన్నారు.

బిజెపి,టిడిపితోనే పొత్తు

జనసేన నేత నాదెండ్ల వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

రానున్న ఎన్నికల్లో బిజెపి, తెలుగుదేశం పార్టీలతోనే పొత్తులు ఉంటాయని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ఆదివారం ఓ హోటల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి విముక్త రాష్ట్రం కోసం బిజెపి, టిడిపిలతో పొత్తులుంటాయని వెల్లడించారు. అన్ని పార్టీలతో చర్చించే క్రమంలో ఈ రెండు పార్టీలతో చర్చించినట్లు చెప్పారు. చాలా కాలంగా జనసేన, తెలుగుదేశం పార్టీల నడుమ పొత్తుల విషయంపై చర్చ సాగుతోంది. ఉంటుందా? లేదా? అనే మీమాంస కూడా నడిచింది. జనసేన టిడిపితో వెళ్లడం బిజెపి వ్యతిరేకిస్తుందనే చర్చ కూడా నడిచింది. మళ్లీ కేంద్రంలోని బిజెపి పెద్దలతో జనసేన నేతలతో పాటు తెలుగుదేశం నేతలు కూడా సంప్రదింపులు జరిపారు. మోడిని చంద్రబాబు పొగడ్తలతో ముంచెత్తారు. దీంతో ఈ రెండు పార్టీల నడుమ పొత్తులకు బిజెపి అంగీకరించింది. దీంతో రాజకీయ పొత్తుల వ్యవహారంపై సందిగ్ధం వీడినట్లు భావిస్తున్నారు. అయితే కర్ణాటకలో బిజెపి ఎలా ఓడిపోయిందో చూశాక కూడా ఇక్కడ జనసేన ఆ పార్టీతోనే కలిసి వెళతామని చెప్పడం చర్చగా మారింది. జనం బిజెపికి ఎలా బుద్ధి చెప్పారో సోషల్‌మీడియాలోనూ పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. ఇక్కడ మాత్రం బిజెపితో ఈ రెండు పార్టీలు కలిసి వెళ్లాలనుకోవడం చూస్తుంటే మునగడానికా? లేక ఎందుకో.? ఆలోచించాలని జనం కోరుతున్నారు. ఇక టిడిపి, జనసేన మధ్య పొత్తు ఉంటుందనే స్పష్టత వచ్చింది. సీట్లు ఓట్లు ఎలా పంచుకుంటారనే విషయం భవిష్యత్‌లో తేల్చుకుంటారు. ముందు పొత్తులపై మాత్రం జనసేన నేత నాదెండ్ల ఓ క్లారిటీ ఇచ్చారు.

రబీ సాగుపై కసరత్తు

- అవసరమైన విత్తనాల కోసం ప్రతిపాదనలు
- రైతులకు అందుబాటులో ఎరువులు
- రైతు భరోసాలో పెట్టుబడి సాయం పంపిణీ
- జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టర్

జిల్లాలో రబీ సాగు ప్రణాళికపై కసరత్తు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. రబీ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు రైతు భరోసా కేంద్రాలు, ప్రైవేట్ డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. వైఎస్ఆర్ రైతు భరోసా - పిఎం కిసాన్ కార్యక్రమంలో రైతులకు అవసరమైన పెట్టుబడి సాయం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. జిల్లాలోని కౌలు రైతులకు అవసరమైన రుణ సదుపాయంతో పాటు సిసిఆర్‌సి కార్డులు పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలోని రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా అందిస్తున్న రాయితీలను ప్రజాశక్తికి వివరించారు. అవన్నీ ఆయన మాటల్లోనే..



ముఖాముఖి

జిల్లాలోని రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఖరీఫ్, రబీ సీజన్‌లలో వారికి అన్ని విధాల సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాం. ప్రధానంగా ఈక్రాప్ బుకింగ్ చేసి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఆయా పంటలకు పరిహారం నేరుగా రైతుల ఖాతాలలోకి ప్రభుత్వం జమ చేస్తోంది.

విత్తనాల కసం ప్రతిపాదనలు

రబీ సీజన్‌లో రైతులకు అవసరమైన 36,300 క్వింటాళ్ళ విత్తనాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఇందులో శనగ 35,000 క్వింటాళ్ళు, వరి 100 క్వింటాళ్ళు, అపరాలు 1200 ఉన్నాయి. శనగకు 25 శాతం, అపరాలకు 30 శాతం సబ్సిడీతో రైతులకు అందిస్తున్నాం. పత్తి 30 వేల హెక్టార్లలో సాగు చేస్తారనే అంచనాతో 1,50,000 ప్యాకెట్లు, మొక్కజొన్న 6400 క్వింటాళ్ళు, జొన్నలు 15 క్వింటాళ్ళు, పొద్దు తిరుగుడు 17.5 క్వింటాళ్ళు, సజ్జలు 280 క్వింటాళ్ళు, మిర్చి 1425.55 కిలోలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

రైతులకు అందుబాటులో ఎరువులు

జిల్లాలోని రైతు భరోసా కేంద్రాలు, ప్రైవేట్ డీలర్ల వద్ద మొత్తం 59,192 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ఇందులో యూరియా 18,292 మెట్రిక్ టన్నులు డిఎపి 7177 మెట్రిక్ టన్నులు, ఎంఒపి 2,157 మెట్రిక్ టన్నులు కాంప్లెక్స్ ఎరువులు 27,574, ఎస్ఎస్‌పి 3991 మెట్రిక్ టన్నులు ఉన్నాయి.

సిసిఆర్‌సి కార్డులు పంపిణీకి చర్యలు

జిల్లాలోని 23 వేల మంది కౌలు రైతులకు సిసిఆర్‌సి(క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డ్స్) పంపిణీకి చర్యలు చేపట్టాం. ఇందులో 15000 మందికి అందజేయటం జరిగింది. మరో 9000 కార్డులను నెలాఖరు పంపిణీ చేస్తాం. కౌలు రైతులను 4500 జాయింట్ లయబిలిటీ గ్రూపులుగా ఏర్పాటు చేసి వ్యక్తిగతంగా, కమ్యూనిటీ పరంగా 23.98 కోట్ల రుణాలు బ్యాంకుల ద్వారా అందజేశాం.

197 గ్రూపులకు యంత్రాలు అందజేత

వైఎస్ఆర్ యంత్ర సేవా పథకంలో జిల్లాలోని రైతులకు యంత్రాలు అందజేసేందుకు చర్యలు చేపట్టాం. 205 యూనిట్లు ఇవ్వాలన్నది లక్ష్యం కాగా 195 యూనిట్లు ఇచ్చాం. కమ్యూనిటీ హైయరింగ్ సెంటర్స్ ద్వారా 197 గ్రూపులకు సగటున 9.5 లక్షల నుంచి 15 లక్షల వరకు అందజేస్తున్నాం. ఇందులో ట్రాక్టర్లు, మినీ కల్టివేటర్లు, ప్లడ్లర్లు, కంబైన్డ్ హార్వెస్టింగ్ మెషీన్, సీడ్ కం ఫెర్టిలైజర్ డ్రిల్ అందజేస్తున్నాం.

రైతు భరోసాలో 386 కోట్లు పంపిణీ

వైఎస్ఆర్ రైతు భరోసా – పిఎం కిసాన్ పథకంలో గత 13 విడతలుగా 2.86 లక్షల రైతులకు 386 కోట్లు పంపిణీ చేయటం జరిగింది. ఒక్కో రైతుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడతకు 13,500 పెట్టుబడి సాయం అందిస్తున్నాయి. 14వ విడత రైతు భరోసా పెట్టుబడి సాయం జూన్‌లో ప్రభుత్వం అందజేయనుంది.

ఈ-క్రాప్‌లో పంటల నమోదు

ఈ–క్రాప్ బుకింగ్‌లో వివిధ పంటలను మండల స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు నమోదు చేస్తున్నారు. ఖరీఫ్‌లో 4,94,937 ఎకరాలు లక్ష్యం కాగా 100 శాతం చేయటం జరిగింది. రబీ సీజన్‌లో 3,55,00 ఎకరాలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 3,53,000 ఎకరాలు నమోదు చేసి 97 శాతం ఈక్రాప్ బుకింగ్ చేశాం.



ఎడ్ల పందేలు నిర్వహిస్తున్న దృశ్యం

తిమ్మాపురంలో ఎడ్ల పందేలు

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల మండలంలోని తిమ్మాపురం గ్రామంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి పాలపండ్ల ఎడ్ల పందేలు ఘనంగా జరిగాయి. ఈ పోటీలలో కంభం మండలం సూరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సీతారెడ్డి ఎడ్లు మొదటి బహుమతిని దక్కించుకున్నాయి. వీరికి నల్లబోతుల వెంకటేశ్వర్లు బహుమతిగా రూ.20 వేలు అందజేశారు. రెండో బహుమతిని తిమ్మాపురం గ్రామం మండ్ల కాశీ రాములు ఎడ్లు కైవసం చేసుకున్నాయి. వీరికి బహుమతిగా రూ.పది వేలను గ్రామకంఠం అందజేసింది. తృతీయ బహుమతిని తిమ్మాపురం గ్రామానికి చెందిన నాగేపోగు యేసేబు ఎడ్లు గెలుచుకున్నాయి. బహుమతిగా రూ. ఐదు వేలను పరిమిశెట్టి చిన్న వెంకటయ్య అందజేశారు. ఎడ్ల పోటీలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న దామచర్ల సత్య

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం కీర్తిశేషులు చీమకుర్తి వెంకటేశ్వర్లు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దామచర్ల సత్యనారాయణ(సత్య) ఆదివారం ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చీమకుర్తి కష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ క్రికెట్ పోటీలను దామచర్ల సత్య ప్రారంభించి.. క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీమకుర్తి వెంకటేశ్వర్లు ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత తెలుగుదేశంపై ఉందన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వేల్పుల సింగయ్య, సన్నిబోయిన శ్రీనివాసులునాయుడు, కూనపురెడ్డి వెంకటసుబ్బారావు, చిగురుపాటి శేషగిరి, కనిగిరి వెంకటేశ్వర్లు, కల్లగుంట నరసింహ, ఇమ్మడిశెట్టి రామారావు, ఓలేటి రవిశంకర్‌రెడ్డి, పసుపులేటి వెంకటశేషు, సుదర్శి ప్రసాదరావు, నర్రా రాంబాబు, షేక్ యస్దాని పాల్గొన్నారు. ఈ క్రికెట్ పోటీలకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి 16 జట్లు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

రాచర్ల ఎస్ఐపై మహిళల ఫిర్యాదు

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

తమపై రాచర్ల ఎస్ఐ మహేష్ దాడి చేశారని గిద్దలూరు సిఐకి బాధిత మహిళలు ఆదివారం ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం ప్రకారం.. రాచర్ల మండలం, యడవల్లిలో ఈ నెల 12న ఓ ఇంట్లో మద్యం అమ్ముతున్నారని తనిఖీలు చేసిన రాచర్ల ఎస్ఐ మహేష్ ఆ ఇంట్లో వీరంగం సృష్టించి మహిళలపై దాడి చేశాడు. దీంతో బాధితులు సిఐకు ఫిర్యాదు చేశారు. ఎస్సై వీరంగంతో భయభ్రాంతులకు గురైన బాధిత మహిళలు కోర్టును ఆశ్రయించి.. ప్రైవేట్ కేసు కూడాపెట్టారని సమాచారం.

ఇళ్ల స్థలాల

అభివృద్ధి పనుల్లో భారీగా అవినీతి

టిడిపి విద్యార్థి విభాగం జిల్లా మాజీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఉమ్మడి ప్రకాశం జిల్లా జగనన్న కాలనీల లేఅవుట్లలో ఇళ్లస్థలాల అభివృద్ధి పనుల్లో దాదాపు రూ.200 కోట్ల మేర అవినీతి జరిగిందని జిల్లా తెలుగుదేశం పార్టీ విద్యార్థి విభాగం మాజీ అధ్యక్షులు కాటూరి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. లేఅవుట్ల అభివృద్ధిలో జరిగిన అవినీతిని తాము సమాచార హక్కు చట్టం ద్వారా వెలికితీసేందుకు ప్రయత్నించగా తమకు సమాచారం ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని తెలిపారు. గంగవరపు ప్రదీప్‌కుమార్ 2021 సంవత్సరం ఏప్రిల్‌లో సమాచార హక్కు చట్టం కింద ఇళ్లస్థలాల అభివృద్ధి పనుల గురించి అడిగారని తెలిపారు. అయితే 56 మండలాలలో ఎలాంటి సమాచారం నిర్దిష్టంగా ఇవ్వలేదని



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

చెప్పారు. దీనిమీద సమాచార హక్కు కమిషన్ కార్యాలయం మూడు సార్లు విచారణ జరిపి సమాచారం ఇవ్వండి, అవసరం అయితే రికార్డులు చూసుకునేందుకు వీలు కల్పించండి అని ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. కమిషన్ ఉత్తర్వులు జిల్లా నీటియాజమాన్య సంస్థ అధికారులు పట్టించుకోలేదని చెప్పారు. దీనిమీద తాము మళ్లీ కమిషన్‌ను ఆశ్రయించగా రికార్డులు చూసుకునేందుకు జిల్లా నీటియాజమాన్య సంస్థ అధికారులు మండలాల వారీగా తేదీలు ఇచ్చారు కానీ మండలాల్లో అధికారులు రికార్డులు ఇవ్వడానికి ఇష్టపడలేదని చెప్పారు మెటీరియల్ బిల్లుల ఓచర్స్ ఇవ్వడం లేదని వివరించారు. లేకపోతే లేవు అని రాసివ్వడానికి ముందుకు రావడం లేదన్నారు. కొన్ని చోట్ల దొంగ బిల్లులు పెట్టి పేమెంట్లు చేసినట్లు తమ పరిశీలనలో తేలిందన్నారు. జిల్లా మొత్తంమీద భారీ అవినీతి జరిగిందని వివరించారు. జగనన్న కాలనీలలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల గురించి సమాచార హక్కు చట్టం కింద తాముకోరిన సమాచారం ఇవ్వకపోతే హైకోర్టుకు వెళ్లే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు.

ఘనంగా మాతృమూర్తుల దినోత్సవం

ముగ్గురు తల్లులకు ఘన సత్కారం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం), ఆంధ్రప్రదేశ్ మహిళాభ్యుదయ సమితి సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ తల్లుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక హౌసింగ్ బోర్డ్‌లోని సమితి కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షులు తేళ్ల అరుణ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో శాంతమ్మ, మస్తానమ్మ, కోటేశ్వరమ్మను ఘనంగా సన్మానించారు. వారి జీవిత అనుభవాలను అక్కడున్న యువతులు అడిగి తెలుసుకున్నారు. అతిథులుగా నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి



తల్లులను సత్కరిస్తున్న నరసం నాయకులు

జ్యోతిర్మయి, మాజీ మహిళా కమిషన్ మెంబర్ తమ్మిశెట్టి రమాదేవి, సమితి రాష్ట్ర కోశాధికారి బీరం అరుణ, మాజీ ఎంపిపి చిరుతోటి నరసమ్మ, నరసం జిల్లా ఉపాధ్యక్షురాలు మారేపల్లి సూర్యకుమారి, ట్రాన్స్‌జెండర్స్ నాయకురాలు బోనుదుర్గ, శక్తి సదన్ డైరెక్టర్ కె.శాంతిలత, సిహెచ్. కనకదుర్గ, గుంటుపల్లి శ్రీదేవి, వేమ సుశీల పాల్గొన్నారు.

బ్లీచింగ్ భద్రపరిచే గోడౌన్ పరిశీలన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగం అధికారులు బ్లీచింగ్ భద్రపరిచే గోడౌన్‌ను నగర ఇన్‌ఛార్జి మేయర్ వేమూరి సూర్యనారాయణ(బుజ్జి) ఆదివారం పరిశీలించారు. మొత్తం బ్లీచింగ్ నిల్వల వివరాలు, రోజుకు ఎంత బ్లీచింగ్ వినియోగిస్తున్నారు.? అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాన్ని శుభ్రంగా ఉంచేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. అందుకు అవసరమైన చీపుర్లు, దంతెలు, బ్లీచింగ్, ఫైరోసిన్ ఆయిల్ అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. కాల్వల్లో పూడిక తీసిన చోట వ్యర్థాలమీద తప్పని సరిగా బ్లీచింగ్, సున్నం చల్లాలని చెప్పారు. మురుగు నిల్వల ప్రాంతాలను గుర్తించి దోమలు ఉత్పత్తి కాకుండా ఆయిల్ బాల్స్



బ్లీచింగ్ గోడౌన్‌ను పరిశీలిస్తున్న వేమూరి బుజ్జి

వదలాలని ఆదేశించారు. కాల్వలను ప్రతిరోజు శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన కార్మికుల మస్టర్ పాయింట్‌ను తనిఖీ చేశారు. ఆయన వెంట శానిటరీ సూపర్‌వైజర్ ఎన్.పిచ్చయ్య, ఇన్స్‌పెక్టర్ షేక్ బాబ్జీ ఉన్నారు.

విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల ఎదుట ఉన్న ఆంజనేయస్వామి గుడి వద్ద హనుమాన్ జయంతి పర్వదినం సందర్భంగా ఆదివారం అన్నదానం చేశారు. విశ్రాంత ఉద్యోగులు నాలి వెంకటేశ్వర్లు, ఐటిడిఏ అంబులెన్స్ డ్రైవర్ నలగాటి వెంకట్రామయ్య నాయుడు, హెల్త్ అసిస్టెంట్ పిల్లి ఆవులయ్య వారి సొంత నిధులతో పులిహారం, దద్దోజనం భక్తులకు అందజేశారు.



అన్నదానం చేస్తున్న దృశ్యం



ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి సురేష్

హనుమాన్ జయంతి సందర్భంగా..

మంత్రి సురేష్ ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

హనుమాన్ జయంతి సందర్భంగా యర్రగొండపాలెం పట్టణంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ పూజారి మంత్రి సురేష్‌ను ఆలయంలోకి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ కాలం కలిసి రావాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించారు. తిరిగి జగనన్న ముఖ్యమంత్రిగా ఎన్నికై రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ ఏఎంసి చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్‌గౌడ్, జడ్పీటిసి చేదూరి విజయభాస్కర్ పాల్గొన్నారు.

సిమ్స్ చర్మవ్యాధుల హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు

నగరంలోని 60 అడుగుల రోడ్డులోని సీనియర్ డెర్మటాలజిస్ట్ డాక్టర్ వి.చెంచయ్య ఆధ్వర్యంలో సిమ్స్ చర్మవ్యాధుల హాస్పిటల్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ చెంచయ్య మాట్లాడుతూ తమ వైద్యశాలలో తక్కువ ఖర్చుతోనే నాణ్యమైన వైద్యసేవలందిస్తామన్నారు. అన్ని రకాల చర్మ సమస్యలకు తమ వద్ద ఆధునిక వైద్యపరికరాలతో వైద్యం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ డాక్టర్ అనపర్తి శ్రీనివాస్, నగరంలోని పలువురు వైద్యులు పాల్గొన్నారు.



గిరిజనులకి భోజనం పంపిణి చేస్తున్న దృశ్యం

మానవత్వం చాటిన మహిళా కానిస్టేబుల్

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం, పకీరుపాలేనికి చెందిన మహిళా కానిస్టేబుల్ రేష్మ మానవత్వాన్ని చాటుతోంది. ప్రస్తుతం జరుగుమల్లి మండలం పోలీస్‌స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న ఆమె తన కుమారుని పుట్టినరోజు సంద్భంగా ఆదివారం శానంపూడి గ్రామం గిరిజన కాలనీ చిన్నారులకు అన్నదానం చేశారు. తన కుమారుని చిన్నతనం నుండి ప్రతి పుట్టినరోజుకి ఇలాగే అన్నదానం చేస్తున్నట్లు ఆమె తెలిపారు. తను పనిచేసే ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న బాలికల వసతి గహాలను సందర్శిస్తూ తల్లిదండ్రులు లేని బాలికలను చేరదీసి.. అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నారు. కార్యక్రమంలో న్యాయ సేవా సహాయకులు పంతగాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పామూరు

గుండెపోటుతో యువకుడు మృతిచెందిన ఘటన గోపాలపురంలో చోటుచేసుకుంది. గోపాలపురానికి చెందిన బొట్లా సుబ్బరాయుడు(40) టెన్షన్‌కు గురై శనివారం రాత్రి 10 గంటల సమయంలో బిపి తగ్గి పడిపోయాడు. హార్ట్‌స్ట్రోక్ రావడంతో కుటుంబసభ్యుల సహకారంతో హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించారు. కుటుంబ యజమాని చనిపోవడంతో భార్య, పిల్లలు శోకసముద్రంలో మునిగిపోయారు. బ్యాంకుల నుండి వత్తిడి చేస్తున్నారని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-పర్చూరు

ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం పర్చూరు వేదికగా జాతీయ స్థాయి క్రికెట్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో ఏలూరి యూత్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ టి-20 క్రికెట్ ఇండియా లెవెల్ టోర్నమెంటు ఆదివారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు పర్చూరులో జరుగుతాయి. ఈ పోటీలను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి దామచర్ల సత్య, తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి కొండయ్య ప్రారంభించారు. తొలుత పర్చూరు బొమ్మల సెంటర్‌లో ఎన్‌టిఆర్ విగ్రహానికి, అంబేద్కర్ విగ్రహాలకు పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తాతా జయప్రకాష్ నారాయణ, రాష్ట్ర కార్యదర్శులు సలగల రాజశేఖర్, దాసరి ఉషారాణి, దేవతోటి



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న దృశ్యం

నాగరాజులతో కలిసి దామచర్ల సత్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వై జంక్షన్ వద్ద ఉన్న అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ర్యాలీలో తెలుగుదేశం పార్టీ నాయకులు, ఏలూరి అభిమానులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభించిన సత్య

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలను పార్టీ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య, చీరాల ఇన్‌చార్జి ఎంఎం కొండయ్య ప్రారంభించారు. తొలి పోటీలలో ఎస్‌డబ్ల్యుసిసి తిరుపతి, ప్రభు లెవెల్ బ్రదర్స్ కామారెడ్డి జట్లు పోటీపడ్డాయి. పోలీసు లెవెన్ వర్సెస్ గుంటూరు, మలినేని గుంటూరు జట్ల మధ్య పోటీ జరిగింది. కార్యక్రమంలో ఏలూరి యూత్ నిర్వాహకులు తులసి శ్రీనివాసరావు, మామిడిపాక హరిప్రసాద్, చింపయ్య, మండల పార్టీ అధ్యక్షులు షంషుద్దీన్, నాగేశ్వరరావు, నాయుడు హనుమంతరావు, కృష్ణారావు, హరిబాబు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

నేడు అద్దంకిలో టిడిపి పాదయాత్ర

ప్రజాశక్తి-అద్దంకి

తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువ గళం పాదయాత్ర 100వ రోజుకు చేరుకుంటున్నందున, దీనికి మద్దతుగా అద్దంకి మండల, పట్టణ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు టిడిపి నాయకులు తెలిపారు. స్థానిక బంగ్లా రోడ్డు అంబేద్కర్ బొమ్మ వద్ద నుంచి పాదయాత్ర ప్రారంభమై సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం వరకు సాగుతుందని తెలిపారు. తెలుగుదేశం పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు ఈ పాదయాత్రలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున కార్యకర్తలు, అభిమానులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

వెండి కిరీటం బహూకరణ

ప్రజాశక్తి-అద్దంకి

సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి వారికి ఆదివారం పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం పరగడిచర్ల గ్రామానికి చెందిన గుడిపూడి ఆంజనేయులు దంపతులు 500 గ్రాముల వెండి అర్ధ కిరీటాన్ని బహూకరించారు. అద్దంకి మండలం కొంగపాడు గ్రామానికి చెందిన గుడిపూడి అద్విక మరో 200 గ్రాముల వెండి కుందులు(2)ను బహూకరించారు. వీరిద్దరూ ఈ ఆభరణాలను దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి టి సుభద్రకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సంఘీభావ యాత్రలో అధిక సంఖ్యలో పాల్గొనాలి

ప్రజాశక్తి-నగరం

నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర నేటితో 100 రోజులు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా 175 నియోజకవర్గాలలో జరుగనున్న సంఘీభావ యాత్రను జయప్రదం చేయాలని భట్టిప్రోలు మండల టిడిపి కన్వీనర్ వాకా శేషుబాబు కోరారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ చుండూరు మండలం యడ్లపల్లి ఎన్టీఆర్ విగ్రహం నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర ఉదయం 7 గంటలకు మొదలవుతుందని, నడిగడ్డపాలెం మీదుగా చుండూరు అంబేద్కర్ నగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగుతుందని తెలిపారు. మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు పాల్గొనే ఈ యాత్రకు భట్టిప్రోలు మండలం తోపాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.



మజ్జిగ అందజేస్తున్న హృదయ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

ప్రతి ఆదివారం మజ్జిగ చలివేంద్రం

ప్రజాశక్తి-వేటపాలెం: మజ్జిగ చలివేంద్రం హృదయ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్నారు. వేసవిలో పాదచారుల, వాహనదారుల దాహార్తిని తీర్చడానికి హృదయ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో రామా నగర్‌లోని డాక్టర్ మధు క్లినిక్ ప్రాంగణంలో గత 15 రోజుల నుంచి చలివేంద్రం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ప్రతి ఆదివారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వేసవి ఎండలు, వడగాలులు పెరుగుతున్న నేపథ్యంలో ఇలాంటి ఆరోగ్యకరమైన మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేయడం సంతోషదాయమని వైస్ ప్రెసిడెంట్ బొడ్డు శివయ్య అన్నారు. హృదయ వెల్ఫేర్ అసోసియేషన్ వారు ఇలాంటి మంచి సామాజిక కార్యక్రమాలు మరిన్ని ఏర్పాటు చేయాలని అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బొగ్గుల శ్రీనివాసరావు అన్నారు. పులిహోర పంపిణీ కార్యక్రమం కూడా జరిగింది. ఈ కార్యక్రమానికి మందారపు రమేష్, మాజేటి బాలాజీ, వూట్ల వెంకటేశ్వర్లు, వారి శ్రీనివాసరావు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు బొగ్గుల శ్రీనివాసరావు, ప్రెసిడెంట్ నన్నపనేని సునీల్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ బొడ్డు శివయ్య, ఆర్గనైజర్ అండ్ ట్రెజరర్ పేరిసెట్ల బ్రహ్మయ్య, జనరల్ సెక్రెటరీ గుగ్గిలం శ్రీహరి, సభ్యులు డాక్టర్ మధు, వూట్ల వెంకటేశ్వర్లు, పెద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మాజేటి బాలాజీ, బుద్ధి శ్రీనివాసరావు, మస్తాన్, సోమరాజు, బొడ్డు వెంకటేశ్వర్లు, గాత్రం బాలాజీ (ఫోటో స్టూడియో), మరియు ముఖ్యఅతిథిగా నాసిక వర శివాజీ హాజరయ్యారు.

నేడు టిడిపి సంఘీభావ పాదయాత్ర

ప్రజాశక్తి-నగరం

నారా లోకేష్ యువగళం పాదయాత్ర 100 రోజులు చేరుకున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో సంఘీభావ పాద యాత్ర నిర్వహిస్తున్నామని రేపల్లె శాసనసభ్యులు అనగాని సత్య ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రేపల్లె నియోజకవర్గంలో రేపల్లె మండలం కారమూరు గ్రామంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు సంఘీభావ పాదయాత్ర ప్రారంభం అవుతుందన్నారు. ఈ పాదయాత్రకు రేపల్లె నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-నగరం

స్థానిక లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీనివాసుని కల్యాణం వైభవంగా జరిగింది. ఈ కల్యాణంలో పెట్టు పోల్‌రెడ్డి దంపతులు, పద్యాల గోపిచంద్ర స్వామి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శాసన శంకర్రావుకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అన్నదాన కార్యక్రమాన్ని శంకర్రావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తూనుగుంట్ల సురేష్ కుమార్, జగదీష్ కుమార్, చింతల వెంకట శేషసాయి ప్రసాద్, ఊర సుబ్బారావు, యార్లగడ్డ చింతయ్య, మట్ట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వధూవరులతో కృష్ణ చైతన్య

నేడు భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-నగరం

భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఐ వేమూరు నియోజకవర్గ అధ్యక్షులు బండారు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం భట్టిప్రోలులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత మూడున్నర ఏళ్లుగా భవన నిర్మాణ కార్మికుల క్లయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న సంక్షేమ బోర్డును ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. నిర్మాణ రంగంలో వసూళ్లు చేస్తున్న ఒక శాతం చెస్ సంక్షేమ బోర్డుకు జమ చేయకుండా ప్రభుత్వం మోసం చేస్తోందని ఆరోపించారు. ఈ సమస్యల పరిష్కారానికి ఈ నెల 15న చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి శ్రీనివాసరావు, రఘురాం ప్రసాద్ తదితరులు ఉన్నారు.

లోక్ అదాలత్‌లో 465 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-నగరం: రాష్ట్ర హైకోర్టు ఉన్నత ఆదేశాల మేరకు రేపల్లె కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 465 కేసులు పరిష్కారమయ్యాయని సీనియర్ సివిల్ జడ్జి టి వెంకటేశ్వర్లు తెలిపారు. ఇందులో సివిల్ 20, క్రిమినల్ 443, ప్రీ లిటిగేషన్2, కేసులు పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. ఈ కేసులలో లక్షల రూపాయలు పరిష్కరించి లబ్ధిదారులకు ఇప్పించినట్లు తెలిపారు. లోక్ అదాలత్‌లో రెండు బెంచీలు ఏర్పాటు చేసి 1వ బెంచ్‌కి సీనియర్ సివిల్ జడ్జి టి వెంకటేశ్వర్లు, 2వ బెంచ్‌కి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎల్ జగదీష్ కుమార్ అదాలత్ నిర్వహించారు. న్యాయవాదులు కే శ్రీనివాసరావు ఎం రామకృష్ణ, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది, బ్యాంకు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

వధూవరులకు కృష్ణ చైతన్య ఆశీర్వాదం

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలోని కామేపల్లి గ్రామంలో ఆదివారం, గుండపునేని వారి వివాహానికి రాష్ట్ర శాప్ నెట్ చైర్మన్, వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైసీపీ మండల కన్వీనర్ చింతా రామారావు, జడ్పిటిసి అడవి శ్రీనివాసరావు, వెల్లలచెరువు సొసైటీ అధ్యక్షులు చింతా శ్రీధర్, బొల్లినేని రామకృష్ణ, నాగబోతు రామాంజనేయులు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

40 ఏళ్ల తరువాత కలుసుకున్న వివిధ బ్యాచ్‌ల విద్యార్థులు

ప్రజాశక్తి-అద్దంకి: కట్ట రామ కోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సుమారు 40 ఏళ్ల తరువాత ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల పూర్వ విద్యార్థి, ఈ సంఘం అధ్యక్షులు దామ హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ ప్రిన్సిపాల్, సిపిడిసి మెంబర్ డాక్టర్ ఉబ్బా దేవ పాలన మాట్లాడుతూ కళాశాల న్యాక్ ఉత్తమ గ్రేడ్ సాధనలో పూర్వ విద్యార్థులు సహకారాన్ని అందించాలని కోరారు. అద్దంకి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కళాశాల ఉత్తమ విద్యను అందిస్తుందని, దాని అభివృద్ధికి అందరి సహకారం అవసరమని తెలియజేశారు. రసాయన శాస్త్ర విశ్రాంతి అధ్యాపకులు జివి రత్నకుమార్, జంతు శాస్త్ర విశ్రాంత అధ్యాపకురాలు మాట్లాడారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి మోహన్‌రావు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు కళాశాల న్యాక్ మంచి గ్రేడ్ సాధనలో సహకారం అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి జ్యోతి రమేష్‌బాబు అధ్యాపకులు ఎస్ రమాదేవి సభ్యులు సంధిరెడ్డి కొండలరావు కళాశాల అభివృద్ధికి సలహాలు అందించారు. ఈ సందర్భంగా వివిధ బ్యాచ్‌ల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను, అనుభవాలను పంచుకున్నారు. కళాశాల పూర్వ విద్యార్థుల కమిటీ కన్వీనర్ డాక్టర్ ప్రభుదాస్, న్యాక్ కో-ఆర్డినేటర్ ఎస్ దాస్ పూర్వ విద్యార్థుల న్యాయవాది అంజిరెడ్డి, ఎన్ శివాజీ, కె సురేష్ వారి సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మదర్స్‌డే

ప్రజాశక్తి-నగరం

స్థానిక సిఫార్డు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మదర్స్ డే సందర్భాన్ని పురస్కరించుకొని స్థానిక నగరం ఎస్టీ కాలనీలో ఆదివారం సాయంత్రం మదర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బాపట్ల జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ చైర్మన్ అయిన ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వసంతం వీరరాఘవయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అడుసుమల్లి ప్రభాకర్‌రావు, సిఫార్డు స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ కొమరాబత్తిని రవి ప్రదీప్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన తరగతులు

ప్రజాశక్తి-సంతమాగులూరు

సంతమాగులూరు గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం పట్ల విద్యార్థులు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేసవికాలం వచ్చినందున తమ పిల్లలు అటు ఇటు తిరుగుతూ ప్రమాదాలకు గురికాకుండా గ్రంథాలయ శాఖ నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం దోహదపడుతుందని అన్నారు. ఉదయం, సాయంత్రం సమయాలలో క్యారంబోర్డు, ఇతర ఆటల పోటీలలో పిల్లలు పాల్గొనడం వల్ల కాలం గడిచి పోతుందన్నారు. గ్రంథ పాలకుడు బాదం విజయభాస్కర్‌రెడ్డి విద్యార్థులకు న్యూట్రిషన్ బిస్కెట్లు అందజేస్తున్నట్లు తెలిపారు.


హృదయ పూర్వక స్వాగతం
తెలుగునేల పై
"తెలుగుదేశం" జెండా ఎగురవేసి..
తెలుగుప్రజల ఆత్మగౌరవాన్ని దేశం నలుమూలలా
చాటిచెప్పిన మహనీయులు టిడిపి వ్యవస్థాపకులు
స్వర్గీయ నందమూరి తారకరామారావు గారి
శతజయంతి సందర్భంగా
నేడు టంగుటూరు లో కొండెపి నియోజకవర్గ స్థాయి
సమావేశానికి విచ్చేయుచున్న
అతిరధ మహారధులకు
హృదయ పూర్వక స్వాగతం....
బొజ్జా శ్రీనివాసరావు
టిడిపి సీనియర్ నాయకులు
చిరుమామిళ్ళ మురళీకృష్ణ
టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు
పునుగోటి పవన్ కుమార్
టిడిపి యువ నాయకులు
చిరుమామిళ్ళ గోపీకృష్ణ
యాదవ జెపిసి అధ్యక్షులు
ప్రకాశం జిల్లా
వల్లూరు గ్రామ తెలుగుదేశం పార్టీ - టంగుటూరు (మం) ప్రకాశం జిల్లా


స్వాగత సుమాంజలి
ఆంధ్రుల ఆత్మ గౌరవాన్ని..
ఆంధ్రుల ఆత్మాభిమానాన్ని..
కాపాడేందుకు "తెలుగుదేశం" పార్టీని
స్థాపించిన తెలుగు ప్రజల ముద్దుబిడ్డ
స్వర్గీయ నందమూరి
తారక రామారావు గారి
శతజయంతి సందర్భంగా
నేడు టంగుటూరు లో కొండెపి
నియోజకవర్గ స్థాయి సమావేశానికి
విచ్చేయుచున్న అతిరధ మహారధులకు
హృదయ పూర్వక స్వాగతం .....
ఏలూరు రాంబాబు, మాజీ సర్పంచ్
కామేపల్లి, జరుగుమల్లి మండలం
ప్రకాశం జిల్లా..


స్వాగతం - సుస్వాగతం
తెలుగు ప్రజల సంక్షేమం కోసం.. తెలుగు ప్రజల సౌభాగ్యం కోసం..
తెలుగు ప్రజల ఆత్మ గౌరవం కోసం.. తెలుగుదేశం పార్టీని స్థాపించి..
దేశ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన తెలుగు ప్రజల ముద్దుబిడ్డ..
కీ.శే నందమూరి తారకరామారావు శత జయంతి సందర్భంగా
నేడు టంగుటూరు లో కొండెపి నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తున్న సందర్భంగా....
ఈ సమావేశానికి విచ్చేయుచున్న అతిరధ మహారధులకు
హృదయపూర్వక స్వాగతం....
చిరుమళ్ళ శ్రీనివాసరావు
టిడిపి గ్రామకమిటీ అధ్యక్షులు
జమ్ములపాలెం
యరమోసు సుధాకరబాబు
టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు
జయవరం
మోపర్తి వెంకట్రామయ్య
మండల టిడిపి వ్యవసాయ కమిటీ నాయకులు
జయవరం
కొల్లా శివప్రసాద్
టిడిపి యువనాయకులు
జయవరం
దూడల తిరుపతి స్వామి
టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు
వాసేపల్లిపాడు
చుండూరి వేణు
ఎంపిటిసి,
మర్లపాడు టిడిపి నాయకులు
కొల్లా రాఘవయ్య
టిడిపి నాయకులు
జయవరం
చల్లాపల్లి రామారావు
టిడిపి నాయకులు
ఆలకూరపాడు
కొమ్ము యేసురత్నం
టిడిపి నాయకులు
సూరారెడ్డిపాలెం
మరియు నాయకులు, కార్యకర్తలు. మండల తెలుగుదేశం పార్టీ - టంగుటూరు(మం), ప్రకాశం జిల్లా..


మదన్నకు జన్మదిన శుభాకాంక్షలు
ప్రగతి సాధన కోసం....
ప్రజా శ్రేయస్సు కోసం....
ప్రతిక్షణం కృషి చేస్తున్న ప్రజల మనిషి
ప్రియతమా శాసనసభ్యులు &
టీటీడీ పాలక మండల సభ్యులు
శ్రీ బుర్రా మధుసూదన్ యాదవ్ గారికి
జన్మదిన శుభాకాంక్షలు
కోనంకి శ్రీను
గుడిపాడు, కనిగిరి(మం)
పొంకం ఏడుకొండలు
చింతలపాలెం, కనిగిరి(మం)
Happy Birthday
BURRA Sir